# సీక్రెట్ గ్యాంగ్

రచన :
శ్రీ సుసర్ల సర్వేశ్వర శాస్త్రి

ఆ 'సీక్రెట్ గ్యాంగ్' గురించి తక్షణం తెలుసు కోవాలి. అలాగైతేనే అందరిలోనూ తన గొప్పతనం వెల్లడి అవుతుంది.

తన దృష్టిలో ఆ విషయం తెలిసినవారు ఇద్దరే. అందులో ఒకరు దూరంగా ఉండగా, రెండవ వ్యక్తి మాత్రం ఇక్కడే వున్నట్లు తాను తెలుసుకున్నాడు. ఈ ఊళ్ళోవున్న వ్యక్తి మామూలుగా అడిగితే ఫలితం ఉండకపోవచ్చు. బెదిరించైనా అనుకున్నది సాధించాలి అని దృఢంగా నిర్ణయించుకున్నాడు వెంకట్.

రాత్రి 9 గం॥ అయింది. శీతాకాలం అవడం వల్ల ప్రస్తుతం ఆ ఇంట్లో ఒక్క వ్యక్తి మాత్రమే ఉన్నాడు. అతని కుటుంబ సభ్యులు సినిమాకి వెళిపోయారు. వాళ్ళు రావడానికి చాలా వ్యవధి ఉంది.

మెల్లిగా తలుపు తట్టాడు.

దగ్గరగా వేసి ఉండడంవల్ల నెమ్మదిగా తెరచుకుంది. లోపలకు రాగానే గబుక్కున గడియపెట్టాడు వెంకట్.

అతను కలుసుకోవాలను కుంటున్న వ్యక్తి కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం దీక్షతో చదువుకుంటూ గడియ శబ్దానికి పుస్తకంలోంచి బయటపడి వెంకట్‌ను ఆశ్చర్యంగా చూసాడు.

“ఆ 'సీక్రెట్ గ్యాంగ్' కాగితాలు ఎక్కడ?'...నిన్ననే చూసిన తెల్లుసిన్మాలో విలన్‌లా భయంకరంగా డైలాగులు వత్తి పలుకుతూ అడిగాడు వెంకట్.

నల్లటి బూట్లు, నల్లటి దుస్తులు, నల్లటి మీసం, నల్లటి శరీర రంగు, బుఱ్ఱమీద మాత్రం నల్ల వెంట్రుకలతో పాటు రెండు పుంజీల తెల్ల వెంట్రుకలతో ఎదురుగా నిల్చున్న వెంకట్‌ని చూసి ఆ వ్యక్తి కలవరపడ్డాడు.

'సీక్రెట్ గ్యాంగ్ ఏమిటి?'

'ఏమీ... తెలియనట్లు నటించకు. వెంటనే జవాబు రాకపోతే ఈ కత్తే జవాబు చెబుతుంది' కత్తితో బెదిరిస్తూ నిన్ననే చదివిన డిటెక్టివ్ నవలలోని డైలాగులు జ్ఞాపకం చేసుకుంటూ అన్నాడు వెంకట్.

'వీడెవడో తాను రాసిన డిటెక్టివ్ కథలు పత్రికల నుంచి తిరిగిరావడం భరించలేక పిచ్చాసుపత్రిలో చేరి అవకాశం దొరకగా తప్పించుకు వచ్చి ఇలా తనపై కక్ష తీర్చుకోడం లేదు కదా! తెల్లు (కాపీ) క్రైం చిత్రాలు చూసి ఈతనికి మతి చలించలేదు కదా! సీక్రెట్ గ్యాంగ్ గురించి పోలీసులను అడగక నన్ను అడుగుతాడేమిటి!' ఆ వ్యక్తి ఆలోచనల్లో పడ్డాడు.

'క్రైం రచనల్లో, సినిమాల్లో చూపించే ట్రిక్కులాంటివి ప్రయోగించి తప్పించుకోవాలనుకోకు. అవన్నీ నేను ఎప్పుడో కంఠతా పట్టేశాను. త్వరగా ఆ 'సీక్రెట్ గ్యాంగ్' కాగితాలు అందచేసి ప్రమాదం తప్పించుకో' అని ఇంకా ఏదో అనబోతూ ఉండగా వెంకట్ నెత్తిమీద ఏదో బరువుగా పడడంతో చేతిలో కత్తి దూరంగా పడి, వెంకట్ బాధగా మూలుగుతూ క్రింద పడ్డాడు.

వెంటనే ఆవ్యక్తి కత్తి తీసి కిటికీలోంచి విసిరేసాడు.

'ఇటువంటి ట్రిక్కులు జరుగుతాయని తెలిసీ కూడ ఏమరుపాటుగా ఉండడం నాదే తప్పు' అన్నాడు వెంకట్ బాధగా మూలుగుతూ, నొప్పెడుతున్న చేతిని తడుముకుంటూ లేవకుండానే.

'నీ బొంద! నేనేమి ట్రిక్కు చెయ్యలేదు! నీ నెత్తిమీద ఉన్న అటకపై పిల్లి ఎలుకను పట్టుకునేందుకు వేగంగా గెంతడంతో ఒడ్డునే వున్న బరువైన మాసిన బట్టల మూట నీ మీద పడింది. ఏ హాస్పటల్ నుంచి తప్పించుకున్నావు? సీక్రెట్ గ్యాంగ్ అంటూ నన్ను సతాయిస్తున్నావు' అన్నాడు ఆ వ్యక్తి బట్టల మూట ఒక వారగా పెడుతూ.

'మీకు ఏమీ తెలియనట్లు నటించకండి సార్! ఆ విషయం మీకు తెలియకుండా ఎలా వుంటుంది? మామూలుగా అడిగితే ఆ కాగితాలు ఇవ్వరని ఇలా బెదిరింపుకు దిగాను. మీ పత్రికలో ప్రచురించబడుతున్న 'సీక్రెట్ గ్యాంగ్' సీరియల్ చదువుతున్న నాకు తరువాత ఏం జరుగుతుందో నన్న ఆత్రుత, సస్పెన్స్ భరించలేక పోయాను. రచయితగారి చిరునామా తెలియదు. అందుకే ఆయన్ని వదలి పత్రిక ఎడిటర్ అయిన మీ దగ్గరకు వచ్చాను. ఆ కాగితాలు మీ దగ్గర తీసుకుని చదివేసి జాగ్రత్తగా మీకు వాపస్ చేసేయాలనుకున్నాను. తరువాయి సంచికల్లో ఏం పడుతుందో స్వంతంగా ఊహించి చెప్పగలను అని మిత్రులతో పందెం కాసి నేను చదివినవి వివరించి డబ్బు కొట్టేయాలనుకున్నాను. కాని వ్యవహారం పిల్లివల్ల బెడిసి కొట్టింది.'

'ఆ విషయం ముందే చెప్పి ఉంటే బాగుండేది. నీవు అనుకున్నట్లు ఆ రచన మా దగ్గర మొత్తంగా లేదు. ఆ రచయితగారు చాలా బిజీగా వుంటారు. అందువల్లే ఏ నెల భాగం ఆ నెల వారం రోజులు ముందుగా అందిస్తూ ఉంటారు. అందువల్ల నీకే కాదు నాకూ తెలియదు తర్వాత ఏం జరుగుతుందో! ఇంతకీ నువ్వెవరో చెప్పలేదు'.

'నేను మీ పత్రికలో రెగ్యులర్ గా ఉత్తరాలు రాసే రచయిత వెంకట్ ని. కొన్ని కథలు కూడా పంపుతున్నాను కాని ఉత్తరాలు మాత్రమే వేస్తు కథల్ని మొహం మాటం లేకుండా తిప్పిపంపేస్తున్నారు'.

'నీలో రచనలు చేయాలన్న అభిలాష ఉంది గాని మరికొద్దిగా కృషి అవసరం. ఇక ముందు ఇటువంటి తెలివి తక్కువ పనులు చేయకు' అంటూ ఆ వ్యక్తి వెంకట్ ని రిక్షా ఎక్కించాడు.

---


## కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 11-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారలుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స బుక్ స్టాల్సులో దొరుకును.

* కథాంజలి *

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 001.